# మహాతల్లి

(గల్పిక)

నిజంగా మహాతల్లే ! ఆవిడను చూస్తే ఎలాటివాళ్ళకూ పూనకం వచ్చినట్ట యేది. తాము ఏంచేస్తున్నదీ, ఏం మాట్లాడుతున్నదీ వాళ్ళకు తెలిసేది కాదు. వెనకటి యుగాల "మదర్ గాడెసెస్" ఇంతకన్న గొప్ప "ఇమేజ్" కలవాళ్ళు కారని రూఢిగా చెప్పవచ్చు.

అయితే ఇది నాస్తికయుగం గనక, ఒకళ్ల దేవత అన్న మనిషిని మరొకళ్లు సైతాను అనటం స్వాభావికం. మహాతల్లిని సైతాను అనలేదుగాని వెర్రిదని ఒక ప్రవాదు వేశారు. ఆవిడ కొందరు భక్తులను కరిచిందనీ, దరిమిలా వాళ్లు చచ్చారనీ వదంతులు వ్యాపింపజేశారు.

ఈ వదంతులను చాలామంది మొదట్లో నమ్మలేదు. కాని ఆమె భక్తులను అప్పుడప్పుడూ కరవటం కొందరి కళ్ళబడింది. ఆమెమీది భక్తికొద్దీ వాళ్లు ఆ సంగతి దాచిపెట్టారు. "ఆవిడచేత కరిపించుకుని చస్తే, మరి జన్మ ఉండదు !" అని కూడా కొందరు వాదించారు.

ఆవిడకు ఈ కరిచే జబ్బు రాను రాను ముదిరిపోయింది. ఆవిడకు పిచ్చి అన్నది దాచేస్తే దాగని సత్యం అయిపోయింది. పోలీసులు వచ్చి ఆమెను అరెస్టుచేశారు. కొంతకాలం విశ్రాంతి ఇస్తామని ఆమెతో చెప్పటానికి చాలా పెద్ద పోలీసాఫీసరు వచ్చాడు.

"నాయనా, నన్ను వెర్రాసుపత్రిలో పెట్టటానికా వచ్చావు ?" అని మహాతల్లి అడిగింది.

"ఛ, ఛ ! ఎంతమాట ! ... కొద్ది కాలం విశ్రాంతి ! ... " అని పోలీసు అధికారి గొణిగాడు.

"నాకు పిచ్చేమిటి, నాయనా ? నాకు పిచ్చి అన్నవాళ్ళకు పిచ్చి ! కావలిస్తే నా కళ్ళలోకి చూడు !"

మహాతల్లి పోలీసు ఆఫీసరును కండ ఊడేట్టు కొరికింది. మహాతల్లిని జైల్లో పెట్టారు. భక్తులు వేలసంఖ్యలో ఆమెను చూసి ఏడవటానికి వచ్చారు.

"నన్ను పిచ్చిదా న్నంటున్నారు. ఇంతకన్న అన్యాయం ఉందా ?" అంటూ మహాతల్లి అందిన వాళ్లందరినీ కొరికింది.

"నిజంగా పిచ్చే అయి ఉంటుం దంటావా ?" అని భక్తులు ఒకరినొకరు అనుమానంగా అడుక్కున్నారు.

***కొడవటిగంటి కుటుంబరావు***